క్లుప్తంగా

సప్లిమెంటరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అయిదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ లోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సప్లిమెంటరీ విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలో అందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం


లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విమానాశ్రయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యేలు,అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన సత్యవేడుకు వెళ్లారు.

ఘనంగా గంగమ్మ జాతర

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : వెంకటాపురం పంచాయతీ బలరామపురంలో బుధవారం గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఇంటి నుంచి ఊరేగింపుగా వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకున్నారు.

ఉపాధి పనుల తనిఖీ


ఏర్పేడు : కాట్రకాయలగుంటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ

ఏర్పేడు (రేణిగుంట) : ఏర్పేడు మండలం పంగూరు పంచాయతీ కాట్రకాయలగుంటలో జరిగిన ఉపాధి పనులను బుధవారం పీడీ శ్రీనివాసప్రసాద్ తనిఖీ చేశారు. ఓ రైతుకు చెందిన నిమ్మసాగు పొలంలో ఫారంపాండు తవ్వక పనులను పరిశీలించారు. కూలీలకు రూ.300కు పైగా గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలన్నారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల లోపల పనులు పూర్తి చేయాలని ఏపీఓ సుజాతకు సూచించారు.

అధినాయకత్వంపై తిరుగుబాటు

- లోకేష్ సభ ఎదుట నిరసన తెలిపిన ఎమ్మెల్యే వర్గీయులు
- ఆంక్షల నడుమ సభ నిర్వహణపై కేడర్ ఆగ్రహం
- అసలైన టీడీపీ నాయకులకు అనుమతి నిరాకరణపై మరో వర్గం ఆందోళన
- ఆదిమూలం వెంట నడిచిన వారికి అనుమతి నిరాకరణ


సత్యవేడులో లోకేష్ సభ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం వర్గీయులు

వరదయ్యపాళెం : టీడీపీ అది నాయకత్వం తీరుతో సత్యవేడులో దళితులు తిరుగుబాటు తప్పదని ఆ పార్టీకి చెందిన నేతలు లోకేష్ పర్యటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ నాయకుల ముఖాముఖి కార్యక్రమానికి రాష్ట్ర విద్యా శాఖ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. అయితే స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలంకు ఆహ్వానం లేకనే కార్యక్రమం నిర్వహించడంపై ఆ పార్టీకి చెందిన ఒక వర్గం నాయకులు భగ్గుమన్నారు. ఏకంగా ప్లకార్డులు చేతపట్టుకుని లోకేష్ కాన్వాయ్ ఎదుట నిరసన తెలిపారు. ఒక దశలో లోకేష్ బాబు డౌన్ డౌన్ అంటూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆంక్షల నడుమ సభ

సత్యవేడులో జరిగిన లోకేష్ సభ ఆంక్షల నడుమ జరిగింది. పార్టీకి చెందిన కొందరికి మాత్రమే ముఖాముఖి కార్యక్రమానికి అనుమతించారు. దీనిపై పార్టీకి చెందిన మరికొందరు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్థానికేతరుల పెత్తనంపై మండిపాటు

నియోజకవర్గంలో పరిశీలకుడిగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు, కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబు, పక్క నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్తలు నియోజకవర్గంలో పెత్తనం చెలాయించాలని ఊరుకునేది లేదంటూ ఆ పార్టీకి చెందిన నాయకులు ఇల్లంగోవన్ రెడ్డి, మురళి, నందాలు హెచ్చరించారు. కేవలం నియోజకవర్గంలో సంపదను దోచుకోవడానికి కుట్రలు చేస్తూ గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెంటికీ చెడ్డ రేవడిలా ఎమ్మెల్యే పరిస్థితి

సత్యవేడులో జరిగిన లోకేష్ పర్యటనతో ఎమ్మెల్యేపై సస్పెన్షన్ తొలగదు అనే సంకేతాలు స్పష్టమయ్యాయి. ఆ దిశగా నియోజకవర్గ పర్యటన కోసం వచ్చిన లోకేష్‌ను రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే ఆదిమూలం కలిసి అక్కడికే పరిమితమయ్యారు. సమావేశానికి ఆయనను ఆహ్వానించలేదు. ఇది ఆయన వర్గానికి మింగుడు పడక నిరసనకు దిగారు. ఏది ఏమైనప్పటికీ రెంటికీ చెడ్డ రేవడిలా ఎమ్మెల్యే ఆదిమూలం రాజకీయ భవితవ్యం మారింది.

ఎమ్మెల్యే లేకనే సభ ఎలా నిర్వహిస్తారు ?

నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లేకుండా సభ నిర్వహణ ఏమిటని మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే వర్గీయులు ప్రశ్నించారు. సభ వద్ద ఎమ్మెల్యే అనుచరులు నినాదాలతో హోరెత్తించారు. మంత్రిగా లోకేష్ సత్యవేడు టీడీపీలో నెలకొన్న అనిశ్చితను చక్కబెట్టాల్సింది పోయి ఇంకొంచెం విభేదాలు పెంచే విధంగా కార్యక్రమం నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన యాతాటి రమేష్ నుంచి 7 మండలాల్లో పెద్ద ఎత్తున ముడుపులు అందుకుని టీడీపీ బలపర్చిన ఆదిమూలంను ఓడించేందుకు కుట్రలు చేసిన వారితో మంత్రి లోకేష్ ముఖాముఖి నిర్వహించడం ఏమిటని ఇల్లంగోవన్ రెడ్డి, మాజీ ఎంపీపీ మురళి, మాజీ జెడ్పీటీసీ సుమంజలి, నందాలు ఆరోపించారు. అంతేకాక స్వయాన మాజీ ఎమ్మెల్యే హేమలత ఆమె ఇంటిని స్వతంత్ర్య అభ్యర్థి పార్టీ కార్యాలయం కోసం అద్దెకు ఇచ్చి టీడీపీకి వెన్నుపోటు పొడిచిందని, అలాంటి ఆమెను సభలో అనుమతించడమేమిటని ప్రశ్నించారు.




ప్లకార్డులతో నిరసన తెలిపిన టీడీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు, పాత్రికేయులతో మాట్లాడుతున్న పార్టీ కేడర్, సూళ్లూరుపేటకు చెందిన పారిశ్రామికవేత్తను చుట్టుముట్టిన ఆందోళనకారులు

స్క్రాప్ యార్డులో భారీ అగ్నిప్రమాదం


యార్డులో చెలరేగిన మంటలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని డిక్సన్ కంపెనీ వెనుక ఉన్న స్క్రాప్ యార్డులో బుధవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉండటంతో పరిసరాల్లో పొగ అలుముకుంది. స్థానికుల సమాచారంతో నాలుగు ఫైర్ ఇంజిన్లతో అతి కష్టం మీద అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. భారీ స్థాయిలో ఆస్తి నష్టం సంభవించింది. జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం తూకివాకం చిన్న చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గాజుల మండ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ సుధాకర్ తన సిబ్బందితో చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ కోసం గ్రామస్తులను విచారించగా ఐదు రోజులుగా తమిళంలో మాట్లాడుతూ చుట్టుపక్కల తిరుగుతూ ఉండేవాడని తెలిపారు. మృతుడికి సంబంధించి ఎవరికైనా తెలిస్తే 9440 796764, 9440900728 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

లాడ్జీల్లో బసచేసే వ్యక్తుల వివరాలు బహిర్గతం చేయొద్దు

శ్రీకాళహస్తి : లాడ్జీల్లో బసచేసే వ్యక్తుల వివరాలను మరొకరికి ఇవ్వరాదని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని లాడ్జి ఓనర్లు, మేనేజర్లతో శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రిసెప్షన్ రిజిస్టర్‌లో లాడ్జీకి వచ్చే వ్యక్తుల వివరాలను ఆధార్‌కార్డుతో నమోదు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్ల ద్వారా భక్తులను మభ్యపెట్టి వారి నుంచి అధిక వసూళ్లకు పాల్పడకూడదన్నారు. లాడ్జీ రిసెప్షన్ వద్ద గదుల వివరాలు, దాని ధరలు భక్తులకు తెలిసే విధంగా బోర్డును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో లాడ్జీల బయట ఉండి భక్తులు, యాత్రికులను పిలవడం, వారితో అమర్యాదగా ప్రవర్తించడం తగదన్నారు. భద్రతలో భాగంగా లాడ్జీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ గోపి పాల్గొన్నారు.


లాడ్జీల ఓనర్లు, మేనేజర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

అకాల వర్షంతో నష్టం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో మంగళవారం రాత్రి గాలి, వాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షంతో మామిడి, మిరప రైతులకు భారీ నష్టం వాటిల్లింది. 220 ఎకరాల్లోని మామిడి పంట పూర్తిగా దెబ్బతింది. 20 ఎకరాల్లోని మిరప పంట ధ్వంసం అయింది. తడిచిన మిరపకాయలను రైతులు ఆరబెట్టుకుంటున్నారు.

ట్రాన్స్‌కోకు రూ.2లక్షల నష్టం

అకాల వర్షంతోపాటు పెనుగాలులతో 7 విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో రూ. 2 లక్షలు నష్టం వాటిల్లిందని ఏఈ చలపతి తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేస్తూ విద్యుత్ పునరుద్ధరణ చేస్తున్నామని తెలిపారు.


తడిసిన మిరపకాయలను ఆరబెడుతున్న రైతులు

సమరసత సేవా కమిటీ సమావేశం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని నీర్పాకోట గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశం జరిగింది. హిందూ ధర్మంపై ప్రచారం, సనాతన ధర్మం, భజనలు చేయించడం, దేవుని శ్లోకాలను నేర్పించటం వంటి వాటిపై చర్చించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కుమార్ స్వామి, హనుమంతు, రమణయ్య, దశయ్య, సుబ్రమణ్యం, చంద్రయ్య, చినమస్తానయ్య, విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

రేణిగుంట రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ

రేణిగుంట శ్రీకాళహస్తి (రూరల్) : రేణిగుంట రూరల్ సీఐగా మంజునాథ్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ మురళీకృష్ణ బదిలీ కావడంతో అనంతపురం జిల్లా నుంచి మంజునాథ రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్, స్టేషన్ సిబ్బంది సీఐకి గౌరవ వందనం చేశారు. సీఐ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని తెలిపారు.


మంజునాథ రెడ్డి, సీఐ

పోలీసుల పల్లెనిద్ర

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని తారకరామానగర్‌లో బుధవారం రాత్రి సీఐ జయచంద్ర తమ సిబ్బందితో కలిసి పల్లెనిద్ర చేశారు. కాలనీ వాసులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

డబ్బులిస్తేనే.. చెత్త తొలగింపు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : పంచాయతీ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరిస్తున్నారని ప్రచారం చేసుకుంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇంటి నుంచి చెత్త తీసుకొని వెళ్లాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రేణిగుంట పంచాయతీ బిస్మిల్లానగర్‌లోని కీర్తి అపార్ట్‌మెంట్స్‌లో పారిశుద్ధ్య కార్మికులకు డబ్బు ఇవ్వలేదనే కారణంతో చెత్త తీసుకొని వెళ్లలేదని అపార్ట్‌మెంట్‌లో పనిచేసే మంజుల బుధవారం ఆరోపించారు. చెత్త సేకరణ కోసం వారానికి రెండుసార్లు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు వస్తున్నారన్నారు. వచ్చిన ప్రతిసారి అధిక మొత్తంలో డబ్బు ఇవ్వాలని లేనిపక్షంలో అపార్ట్‌మెంట్ నుంచి చెత్త సేకరణ చేయమని తెగేసి చెబుతున్నారని వాపోయారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. దీనిపై ఈఓ మణిని వివరణ కోరగా డ్రైవర్ డబ్బులు అడిగినట్లు సమాచారం వచ్చిందని దానిపై విచారణ చేస్తున్నామని, డబ్బు డిమాండ్ చేసినట్లు రుజువైతే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్సీ నివాళి

ఏర్పేడు (రేణిగుంట) : ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలోని వన్నెకుల క్షత్రియుల సీనియర్ నాయకుడు పైమాల ఎల్లప్పరెడ్డి మృతదేహానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, శ్రీకాళహస్తి బీసీ కన్వీనర్ శివ, మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, సీనియర్ నాయకులు బండారుపల్లి ముని కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నిజాయతీ పరుడైన నాయకుడు మృతి చెందడం పార్టీకి తీవ్ర లోటన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీసిపాయి సుబ్రహ్మణ్యం

మాజీ ఎమ్మెల్యే సతీమణి నివాళి

ఏర్పేడు మండలం వికృతమాల గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎల్లప్పరెడ్డి మృతి చెందడంతో బుధవారం ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, గరటారెడ్డి, ముని రెడ్డి, కేశవులు రెడ్డి, గిరి గౌడ్, జీపి యాదవ్, రామయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న శ్రీవాణి రెడ్డి

గుండ్లకండ్రికలో..

ఏర్పేడు(రేణిగుంట) : శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి బుధవారం ఏర్పేడు మండలంలోని గుండ్లకండ్రిక సర్పంచి జయముని తల్లి నర్మద కర్మక్రియల్లో పాల్గొన్నారు.


భూములు ఇచ్చే ప్రసక్తే లేదు

సత్యవేడు : ఏపీఐఐసీకి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. బుధవారం భూసేకరణలో భాగంగా సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం, రాళ్లకుప్పం గ్రామాల పరధిలోని రైతులతో జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ శ్రీసిటీకి భూములు ఇచ్చి సెక్యూరిటీ ఉద్యోగాలతో జీవనం సాగించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఇచ్చేస్తే పశువులు, మేకలు మేపుకోలేని పరిస్థితి వస్తోందని వెల్లడించారు. తమ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం, చెరువులో మట్టి తరలింపునకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్నా శ్రీసిటీ వారు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భూ నిర్వాసితుల్లో పురుషులకు సెక్యూరిటీ వాచ్‌మన్, మహిళలకు స్వీపర్ ఉద్యోగాలు ఇస్తున్నారని వాపోయారు. శ్రీసిటీకి అప్పగించిన భూముల్లోనే ఇప్పటికీ 2వేల ఎకరాలు మిగిలి ఉన్నాయని, వాటిలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 15 ఏళ్ల నుంచి ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం, రాచపాళెం, రాళ్లకుప్పం గ్రామాలో భూములకు కనీసం రిజిస్ట్రేషన్లు కూడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుగుళంలో పెద్ద చెరువు నీటి వసతితో మూడు పంటలు పండించుకుంటున్నామని తెలిపారు. ఇప్పుడు తమ భూములు లాగేసుకుంటే జీవనాధారం పోతుందన్నారు. దీనిపై జేసీ మాట్లాడుతూ రైతులు తెలియజేసిన విషయాలను కలెక్టర్‌కు వివరిస్తామని చెప్పారు. రాబోయే మంగళ, బుధవారాల్లో మరోమారు రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ కిరణ్మయి, తహసీల్దార్ రాజశేఖర్ , రైతులు కె.సుశీల్ కుమార్ రెడ్డి, కేవీ నిరంజన్ రెడ్డి, కాశీ ప్రతాప్ రెడ్డి, బీబీఎస్ రెడ్డి, రజనీకాంత్ నాయుడు, కరుణాకర్‌రెడ్డి, దయాకర్ బాబు, రవీంద్రరెడ్డి, మురళీనాయుడు, ధనంజయులు, మనోజ్, సదాశివం, చంద్రబాబు, కుప్పమ్మ, బాలాజీ రెడ్డి, మునస్వామి పాల్గొన్నారు.


జేసీ శుభం భన్సల్‌తో మాట్లాడుతున్న రైతులు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి మండలం ఉరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాటు చేశారు.


పూజలు చేస్తున్న అర్చకులు

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం గురవరాజు పల్లి సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతు చేసే ప్రదేశంలో బుధవారం ఎండిపోయిన గడ్డి, ముళ్లపొదలలో అగ్ని ప్రమాదం జరిగింది. దట్టమైన పొగ సబ్ స్టేషన్ ఆవరణ మొత్తం అలుముకోవడంతో ఏం జరిగిందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదం వల్ల ఎటువంటి నష్టం జరగలేదని విద్యుత్ అధికారులు తెలిపారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : పాకిస్తాన్ ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకుందని రేణిగుంట వర్కింగ్ జర్నలిస్టులు బుధవారం రాత్రి భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు వరప్రసాద్, భాగ్య రాజ్, మురళి రాయల్, చిన్నారావ్, మణి, మధు రాయల్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న జర్నలిస్టులు

వ్యవసాయ మోటారు చోరీ

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు మండలం మునగలపాళెం పంచాయతీ కుమ్మరకండ్రిగకు చెందిన మహబూబ్ బాష పొలంలోని వ్యవసాయ విద్యుత్ మోటారు, వైర్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పొలంలో ఉన్న షెడ్డు తాళాలను పగులగొట్టి అందులో ఉన్న మోటారు, పైపులను ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ.30 వేలకు పైగా ఉంటుందని బాధితుడు బుధవారం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో కన్యకా పరమేశ్వరి వేడుకలు

నాగలాపురం : పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీ వేద నారాయణ స్వామి ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు పెద్ద ఎత్తున మహిళలు పాల కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులు సమర్పించిన పాలతో ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

రేపు వాహనాల వేలం

నారాయణవనం : ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను శుక్రవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పుత్తూరులోని ప్రొహిబిషన్ , ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో జరిగే వాహనాల వేలంలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి, నిర్దేశిత ధరావత్తును చెల్లించి పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

రథంపై అగస్త్యేశ్వరుడు

నారాయణవనం : మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం ఉత్సవ మూర్తులు సర్వభూపాల వాహనాన్ని అధిరోహించారు. మేళతాళాలు, కోలాటాల నడుమ స్వామివారు సముదాయం వీధుల్లో విహరించారు. ఏఈవో రవి, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, గౌతం గురుకళ్ పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో గురువారం సాయంత్రం మరగదవల్లీ, అగస్త్యేశ్వరస్వామికి ఆర్జిత కల్యాణం, రాత్రి అశ్వవాహన సేవ, ఉత్సవర్ల ఊరేగింపు నిర్వహించనున్నారు.


వీధుల్లో విహరిస్తున్న అగస్త్యేశ్వరస్వామి